

'పూర్'.. పాలిక
● నిధులు లేక నీరసించిన అభివృద్ధి 6
అద్దె భవనాలు... అరకొర వసతులు 7

నూతనోత్సాహం..



- రెండు ఎమ్మెల్సీ స్థానాల గెలుపుతో బీజేపీలో జోష్
- మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకున్న నాయకులు
- పంచాయతీ ఎన్నికల ముందు ఉత్సాహం నింపిన విజయం

మంచిర్యాల, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు రెండు స్థానాల్లో గెలుపొందడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం ఊహించినదే కాగ పట్టభద్రుల ఎన్నికల్లో విజయం బీజేపీ, కాంగ్రెస్ మధ్యలో దోబూచులాడింది. లెక్కింపు చివరి వరకు కూడ పూర్తి స్థాయి మెజార్టీ ఎవరికి రాకపోవంతో ఒక దశలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరికి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించడంతో బీజేపీ అభ్యర్థికి 5,500 మెజార్టీ లభించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనూహ్య విజయం పట్ల ఆ పార్టీ నేతలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. పంచాయతీ ఎన్నికల ముందు రెండు స్థానాలు కైవసం కావడంతో శుభపరిణామంగా భావిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ రెండు స్థానాలను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

పని చేయని రేవంత్ చరిష్మ..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేయగా రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటి ఫలితం ప్రజలకు దక్కుతేనే పార్టీ అభ్యర్థి ఓట్లు వేయాలని మరీ అభ్యర్థించారు. అయినప్పటికీ వ్యతిరేక ఫలితం రావడంతో కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరాశనిస్పృహలకు లోనవుతున్నారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొన్న దాఖలాలు లేవు. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రేవంత్‌రెడ్డి తానే స్వయంగా రంగంలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడ తమదైన శైలిలో అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్ద తుగా ప్రచారం నిర్వహించారు. మరోవైపు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సైతం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. అయినప్పటికీ ఓటర్ల తీర్పు వ్యతిరేకంగా రావడంతో వారంత నిరాశకు గురవుతున్నారు.

పని చేసిన కేంద్రమంత్రి వ్యూహం..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థులు మల్క కొమురయ్య (ఉపాధ్యాయ), చిన్న మైల్ అంజిరెడ్డి(పట్టభద్రులు)కు మద్దతుగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన ప్రచారం మంచి ఫలితాలను ఇచ్చింది. రెండు సార్లు జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రి చెన్నూర్, మంచిర్యాల..

(తరువాయి 7లో)

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అసంఘటిత రంగాల కార్మికులు

నస్పూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో కనీస వేతనాలు డ్రాఫ్ట్ జీవోలను విడుదల చేసిందని, వేతనాల నిర్ణయం అశాస్త్రీయంగా చేశారన్నారు. పాత విడిఏను ప్రస్తుతం పొందుతున్న వేతనంలో కలిపారే తప్ప కొత్త డ్రాఫ్ట్ జీవోలలో నయా పైసా కూడా పెంచలేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీవోలను సవరించి కనీస వేతనం రూ. 26 వేలను నిర్ణయించి అమలు చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం బ్రాంచ్ అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, బీడి కార్మికులు రాజన్న, రజిత, స్వరూప, రాజ్యలక్ష్మి, శిరీష, శ్రీలత, మానస, రజిత పాల్గొన్నారు.

ఆకతాయిలకు షీటీం కౌన్సెలింగ్

మంచిర్యాల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కొందరు ఆకతాయిలు విద్యార్థినుల పట్ల వెకిలిచేష్టలు చేస్తున్న ఇద్దరిని పట్టుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు షీటీం ఎస్ఐ హైమ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం డెకాయి ఆపరేషన్‌లో భాగంగా షీటీం సభ్యులు గస్తీలో తిరుగుతుండగా ఇద్దరు ఆకతాయిలు విద్యార్థులు వెకిలిచేష్టలు చేస్తూ కనిపించారు. షీటీం సభ్యులు వారిని పట్టుకొని కౌన్సిలింగ్ నిర్వహించినట్లు వారు తెలిపారు.

ఎవరైన విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులకు గురైనట్లయితే వెంటనే వందకు కాని షీటీం నెంబర్ 6303923700కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

పద్మశాలి మహాసభల పోస్టర్ల విడుదల

గర్మిళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న హైద్రాబాద్‌లో జరిగే తెలంగాణ పద్మశాలి సంఘం మహాసభ, 17వ అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభల పోస్టర్లను గురువారం మంచిర్యాలలో పద్మశాలి సంఘం నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ హలో పద్మశాలి చలో హైద్రాబాద్ మహాసభలకు జిల్లాలోని పద్మశాలీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు గడ్డం సుధాకర్, జిల్లా అధ్యక్షుడు దాసు బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి నీలి శ్రీనివాస్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల దేవేందర్, సభ్యులు సత్యనారాయణ, కొమురయ్య ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలి

కోటపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ఈనెల 10లోగా దరఖాస్తులు సమర్పించాలని పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ గురువారం తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లకు 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 13న ఉంటుందన్నారు. అన్ని అధునాతన సౌకార్యలు, ఉత్తమ బోధన, గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో ఆంగ్ల విద్యను అందించేందుకు మోడల్ స్కూళ్లు ఎంతో ఉపకరిస్తున్నాయని వీటిని ఉపయోగించుకుని దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తులకు ఓపెన్ కేటగిరి వారికి రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ , ఈడబ్ల్యూఎస్ వారు రూ. 125 చెల్లించి ఆన్‌లైన్‌లో ఈనెల 10లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మంచిర్యాల క్రైం, మార్చి6 (ఆంధ్ర జ్యోతి): మంచిర్యాల పట్టణం చున్నంబట్టి వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టిపెల్లి నరేశ్‌కు తీవ్ర గాయాలైనట్టు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శెట్టిపెల్లి నరేశ్ మెడికల్ కళాశాలలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం విధులు నిర్వహించుకొని బైక్‌పై చున్నంబట్టి వాడకు వెళ్తుండగా వెనుకాల నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో నరేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నరేశ్ మామ రాజయ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ నర్సింహారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈత చెట్ల తొలగింపునకు అనుమతులు జారీ

- కలెక్టర్ కుమార్‌దీపక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బెల్లంపల్లి మండలం బూదాకలాన్ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటులో భాగంగా ఈత చెట్ల తొలగింపునకు అనుమతులు జారీ చేసినట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అటవీ అధికారి శివ్‌ఆశిష్ సింగ్‌తో కలిసి అబ్కారీ, ఉద్యానవ, సింగరేణి, రెవెన్యూశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూదాకలాన్ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ కోసం సింగరేణి స్థలంలో 464 ఈత చెట్ల తొలగింపు కోసం సంబంధిత శాఖలనుంచి అనుమతులు జారీ అయ్యాయన్నారు. తొలగించిన చెట్లకు బదులుగా సింగరేణి భూముల్లో రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటాలనే నిబంధనతో అనుమతులు జారీ చేశామన్నారు. ఈత చెట్లకు సంబంధించి నష్టపరిహారం 50శాతం భూమి యాజమాని అయిన సింగరేణి సంస్థకు, 25 శాతం గీత కార్మికుల సొసైటికి, మిగిలిన 25శాతం ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్కార, మద్య నిషేదశాఖ పర్యవేక్షకులు నందగోపాల్, జిల్లా ఉద్యానవన అధికారి అనిత, డిసెక్షన్‌పర్యవేక్షకులు అరవింద్, సింగరేణి సీనియర్ ఎస్టేట్ అధికారి నవనీత, ఫారెస్ట్రీమేనేజర్ రమణారెడ్డి, డిప్యూటి ఎస్ఈ నరేష్, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఆసిఫ్, బెల్లంపల్లి నాయబ్ తహసీల్దార్ కల్పన పాల్గొన్నారు.

10 నుంచి పత్తి కొనుగోళ్ల పునః ప్రారంభం

- రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు
- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10 నుంచి పత్తి కొనుగోళ్లు పునః ప్రారంభమవుతాయని రైతులు ఎలాంటి ఆందోళనకుగురి కావద్దని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. గురువారం చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఐ అధికారులు పత్తి కొను గోళ్లను నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని చెన్నూరు, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలకు సంబంధించి కాటన్ కార్పోరేష్ ఆఫ్ ఇండియా 3.56 లక్షల క్వింటాళ్ల పత్తిని ఇప్పటివరకు కొనుగోలు చేసిందన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే 2 లక్షల క్వింటాళ్ల పత్తి ని అదనంగా కొనుగోలు చేసిందన్నారు. జిన్నింగు మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో అధికారులు పత్తి కొనుగోళ్లను నిలిపివేశారన్నారు. ఈ విషయంపై ఎంపీ వంశీకృష్ణ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడుతూ సీసీఐ ఎండీ దృష్టికి తీసుకువెళ్లారని ఆయన గుర్తు చేశారు. ఆధార్ అనుసంధానం సమస్యతో రైతులవద్ద నుంచి పత్తిని కొనుగోలు చేయలేకపోయారన్నారు. ఇంకా రైతుల వద్ద ఉన్న 90వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, అటు సీసీఐ అధికారులు, ఇటు జిన్నింగు మిల్లుల యాజమానులతో మాట్లాడి రైతుల వద్ద ఉన్న పత్తిని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు.

ఈనెల 10 నుంచి పత్తి కొనుగోళ్లు యధావిధిగా ప్రారంభమవుతాయన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా సీసీఐకి పత్తిని విక్రయించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం


ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, మార్చి 6(ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని మార్కెట్ సెంటర్లో గురువారం పెద్దపెల్లి ఎంపీగడ్డం వంశీ కృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్ మాట్లాడుతూ 2020 సంవత్సరంలో కరోనా నేపథ్యంలో బల్లార్ష- కాజిపేట రైలును నిలిపివేశారని, దీంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దృష్టిలో పెట్టుకొని రైల్వే మంత్రికి సమస్యను వివరించారన్నారు. దీంతో కేంద్ర రైల్వేశాఖ మంత్రితో పాటు దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి రైలును పునఃప్రారంభించారన్నారు. ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తు న్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయ కులు రవి, సురేం దర్, లక్ష్మణ్, దనుక్, రాజేష్, చోటు, గణేష్, మహేష్, జీవన్, శ్రీను, సుజిత్, సాత్విక్ పాల్గొన్నారు.

బీజేపీ విజయం కాంగ్రెస్‌కు చెంప పెట్టు


చెన్నూరులో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి6 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం కాంగ్రెస్ పార్టీ అహంకారానికి చెంపపెట్టు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. నాయకులు మల్లారెడ్డి, మున్నారాజా సిసోడియా, పురుషోత్తం, తుల ఆంజనేయులు, శ్రీనివాస్, శోక్‌వర్ధన్, శ్రీదేవి, మల్లికార్జున్, పచ్చ స్వప్నరాణి, తిరుమల పాల్గొన్నారు.

చెన్నూరు : పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కొత్త బస్టాండ్, అంబేద్కర్‌చౌరస్తా, గాంధీ చౌక్‌లలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మాజీ కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, శ్రీపాల్ పాల్గొన్నారు.

నస్పూర్ : ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధించిన సందర్భంగా గురువారం నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద బీజేపీ నాయ కులు టపాసులు పేల్చి స్వీట్లు పంచి సంబరాలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నగునూరు వెంకటేశ్వర గౌడ్, నాయకులు గాజుల ముఖేష్ గౌడ్, ఈర్ల సదానందం, కమాలాకర్ రావు పాల్గొన్నారు.

గర్మిళ్ల : మంచిర్యాలలోని బార్ అసోసియేషన్ హాలులో న్యాయవా దులు సంబరాలు నిర్వహించారు. న్యాయవాది పరిషత్ ప్రధాన కార్యదర్శి తుల ఆంజనేయులు, అధ్యక్షుడు జగన్, డేగ రవి, కిసన్, నరేందర్, శేఖర్, సాగర్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో గురువారం బీజేపీ నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు జనార్ధన్, సీనియర్ నాయకులు దేవరనేని సంజీవరావు, మాజీ ఉపసర్పంచులు రవికుమార్, రాజయ్య, రంజిత్, మల్లేష్, శేఖర్ పాల్గొన్నారు.

దండేపల్లి : దండేపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సంబురాలను ఘనంగా నిర్వహించారు. మేదరిపేట కూడా బీజేపి నేతలు సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శు గోపతి రాజయ్య, శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ బెదుడ సురేష్, నాయకులు సురేందర్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక పాత బస్టాండ్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీజేపీ నాయకులు పూల మాలలు వేసి అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఊత్కూర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు హేమంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు బొప్పు కిషన్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

భీమారం: మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ ఆధ్వర్యంలో నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, చెన్నూరు అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్, నాయకులు నాగేశ్వర్‌రావు, బాపు, సురేష్, మల్లేష్, సురేష్, మల్లయ్య పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవ సంబురాలను గురువారం బీజేపీ నాయకులు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాకాలు పేల్చి నాయకులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి నాయకులు బ్రహ్మానందం, స్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సూరం సంపత్, బీజేపీ సీనియర్ నాయకులు సంతోష్, మండల ప్రధానకార్యదర్శి రెడ్డి బాల రాజు, నాయకులు కిరణ్, శంకర్, రాంచందర్ పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

మంచిర్యాల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు. గురువారం ద్వితీయసంవత్సరం చదువు తున్న విద్యార్థులలో జనరల్ విద్యార్థులు 5299మంది విద్యా ర్థులు హాజరు కాగా 134 గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యా ర్థుల్లో 615మంది విద్యార్థులు హాజరు కాగా 23మంది విద్యా ర్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల అనంతరం పోలీసు బందో బస్తు ద్వారా జవాబు పత్రాలను తరలించారు.

దండేపల్లి: దండేపల్లిలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ కళాశాల చెందిన 222 మంది విద్యార్థులకు గాను 220మంది విద్యార్థులు పరీక్షకు హజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరిండింట్ బి.శోభ డిపార్ట్‌మెంటల్ అధికారి సాయికుమార్ వెల్లడించారు.

కాసిపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జనరల్‌లో 159 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరు కాగా 157 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 39 మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హాజరు కాగా 38 మంది పరీక్షలు రాశారని చీఫ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కాసిపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మూఢ నమ్మకాలను విశ్వసించొద్దు

జన్నారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎవరు కూడా మూఢనమ్మకాలను నమ్మవద్దని ప్రముఖ మెజిషియన్ మహ్మద్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కలమడుగులో గల వివేకా నంద పాఠశాలలో మూఢనమ్మకాల నిర్మూలనపై మ్యాజిక్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాయలు, మంత్రాలు, దయ్యాలు, భూతాలు లేవని, ఇవి ఉన్నాయని మాయ మాటలు చెప్పే వారిని నమ్మవద్దన్నారు. డబ్బాలో నుంచి జాతీయ పతాకం తీయడం, బ్లేడ్‌లను మింగడం, గుడ్డు మాయం చేయడం, డబ్బులు మాయం చేయడం ఎలాగో మ్యాజిక్ చేసి చూపించారు. హెచ్‌ఎం సతీష్‌గౌడ్, ఇన్‌చార్జీ తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

జైపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామ శివారు నుంచి అక్రమంగా తరలిస్తున్న లారీ, జేసీబీ స్వాదీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారు జామున కిష్టాపూర్ నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా లారీ ద్వారా ఇసుక తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పట్టుకున్నామన్నారు. దీంతో పాటు జేసీబీని కూడ స్వాధీనం చేసుకుని జైపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణ చేస్తే పోలీసులకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో దూకిన వ్యక్తిని కాపాడిన యువకులు

నెన్నెల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెరువులో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వ్యక్తిని యువకులు కాపాడిన సంఘటన గంగారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. దామెర చెరువు వైపు వెళ్లిన సెగ్గం అంజి, సెగ్గం సంతోష్, రామటెంకి రాజేందర్, జాడి రాజ్‌కుమార్‌లు ఓ వ్యక్తి చెరువులో దూకడాన్ని గమనించారు. వెంటనే అతడిని బయటకు తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైలారం గ్రామానికి చెందిన కొమ్ము మొండిగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నెన్నెల పోలీసులు మొండికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వివాహిత ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గోపాలవాడకు చెందిన రాజమణి(35) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం 16 ఏళ్ల క్రితం సతీష్ యాదవ్‌తో వివాహం జరిగింది. రాజమణి గతకొన్ని రోజుల నుంచి మానసిక స్థితి సరిగ్గాలేక బాధపడుతూ ఉండేది. గురువారం ఉదయం రాజమణి ఇంటి హాలులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతిపై ఎలాంటి సుమానం లేదని మృతిరాలి తమ్ముడు రఘువర్ధన్ తెలిపారు. రఘువర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. రాజమణికి భర్త సతీష్, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'పూర్'.. పాలిక

- నిధులు లేక నీరసించిన అభివృద్ధి
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు
- పట్టణ ప్రజలకు మార్కెట్ సౌకర్యం కరువు

ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆదాయం లేకుండాపోయింది. దీంతో చిన్న పనులకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



ఆసిఫాబాద్ టౌన్

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సి పాలిటీ గా ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ నిధులు లేక అభివృద్ధికి నోచు కోవడం లేదు. మౌలిక సదు పాయాల కల్పనకు నిధులు అందుబాటులో లేక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణ పరిధిలో పూర్తి స్థాయిలో డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు నిర్మించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత ఆసి ఫాబాద్ రాజంపేట పంపకాలు, విభజన ప్రక్రియ ఆరునెలల పాటు కొనసాగింది. ఆ సమయంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టేవారు అనుమతి పొందేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆ సమస్య తీరినప్పటికీ మున్సిపాలిటీకి ఆదాయం పెరిగే వనరులు మాత్రం కరువయ్యాయి.

● పంచాయతీగా ఉన్న కాలంలో..

ఆసిఫాబాద్ గ్రామపంచాయతీగా ఉన్నంతకాలం జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్ సమీపంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కొనసా గింది. పశువులు, వారసంత ప్రసుత జూబ్లీమార్కెట్ వైపు ఏర్పాటు చేసేవారు. తర్వాత క్రమంలో జూబ్లీ మార్కెట్ నిర్మాణం పూర్తికావడం పాత కూరగాయల మార్కెట్‌ను అక్కడికి తరలించాం. అనంతరం ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా అవిర్భవించి జూబ్లీమార్కెట్ రాజంపేటకు కేటాయించడంతో మున్సిపాలిటీకి మార్కెట్ లేకుండా పోయింది. గతంలో పట్టణం మధ్యలో కూరగాయల మార్కెట్ ఉండడంతో ప్రజలు ఖాళీ సమయాల్లో కూరగాయలు కొనుగోలు చేసేవారు. జిల్లా కేంద్రంగా మారడంతో పట్టణం పరిధి పెరగడంతో పాటు కూరగాయల మార్కెట్ కూడా జూబ్లీ మార్కెట్‌కు తరలివెళ్లింది. దీంతో పాత కలెక్టరేట్ వైపు అంకుసాపూర్ వైపు ఉన్న ప్రజలు కూరగాయల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు.

● రాజంపేట పంచాయతీకి..

ప్రస్తుతం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న జూబ్లీ మార్కెట్‌తో పాటు వారసంత కూడా రాజంపేట గ్రామ పంచాయతీలకు వెళ్లడంతో కూరగాయల మార్కెట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోవాల్సి వస్తుంది. జూబ్లీ మార్కెట్‌కు వచ్చేవారు మున్సిపాలిటీకి చెందినవారు కావడం మున్సిపాలిటీలో మార్కెట్ లేక పోవడంతో ఆదాయం రాజంపేట గ్రామపంచాయతీకి వెళుతుంది. పాత మార్కెట్ స్థానంలో కానీ వ్యవసాయ మార్కెట్ స్థానంలో కానీ మార్కెట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉండడంతో పాటు ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.



రాజంపేట పంచాయతీలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్

మార్కెట్ ఏర్పాటు చేయాలి..

మున్సిపాలిటీ పరిధిలో కూరగాయాల మార్కెట్ ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం కొనసాగుతున్న జూబ్లీ మార్కెట్ బ్రాహ్మణవాడ, సందీప్‌నగర్, బజార్‌వాడి, కంచు కోట తదితర కాలనీల ప్రజలకు దూరంగా ఉంది. పట్టణ మధ్యలో మార్కెట్ ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది.

– సాయి, ఆసిఫాబాద్

సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు

తిరుపతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్



ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీ సిబ్బంది సిబ్బంది సమయపాలన పాటించేందుకు ఏం చర్య లు తీసుకుంటున్నారు?

సూపర్‌వైజర్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని సూచిస్తున్నాం. తరుచూ తనిఖీ చేస్తూ తగిన సూచనలు చేస్తున్నాం. సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శక సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సూపర్‌వైజర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకంగా సేవలు అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కొత్తగా ఫేస్ క్యాప్చర్ యాప్‌ను తెచ్చింది. లబ్ధిదారుల ఫొటో యాప్‌లో పొందుపరిచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఫేస్ క్యాప్చర్ యాప్‌లో సమస్యలేమైనా ఉన్నాయా..?

సూపర్‌వైజర్: ఫేస్ క్యాప్చర్ యాప్‌లో టీచర్లు సెల్ ఫోన్లలో లబ్ధిదారుల వివరాలను పిల్లల హాజరును టేక్ హోం రేషన్ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

– రెబ్బెన, (ఆంధ్రజ్యోతి)

బాలికలు పట్టుదలతో లక్ష్యం సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో జిల్లా మహిళా శిశు, స్త్రీ సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్తంగా నర్వహించిన బేటీ బచావో-బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో కలెక్టర్ మాట్లాడారు. బాలికలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అందరం ప్రోత్సాహం అందించాలని సూచించారు. బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించాలన్నారు. విద్యార్థినులు యుక్త వయస్సులో అనారోగ్యం బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. శరీరకంగా బలంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. బాలికల చదువు కుటుంబంతో పాటు దేశాభివృద్ధికి ముందడుగని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, మాస్టర్ ట్రైనర్లు రాజేష్, రమేశ్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన మాడ లావణ్య అలియాస్ ముస్కురాణి(23) భర్త, అత్తమామల వేధింపులు తాళ లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు హాజీపూర్ ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లావణ్యకు మాడ శంకర్‌రెడ్డితో 2020లో వివాహం జరిగింది. కొన్ని రోజులు వారి సంసారం సాఫిగానే సాగినప్పటికీ అదనపు వర కట్నం తేవాలంటూ భర్త శంకర్ రెడ్డితో పాటు అత్తమామలు జనార్ధన్‌రెడ్డి, లక్ష్మీలు చిత్ర హింసలకు గురిచేశారు. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీకూడ జరి గింది. మృతిరాలికి ఇద్దరు కుమారులు శ్రీచరణ్ రెడ్డి, నిక్కీ ఉన్నారు. మంగళవారం చిత్ర హింసలు భరించలేక లావణ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తర లించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరా బాద్‌కు తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందింది. లావణ్య తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఈ శేషారావు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషారావు అన్నారు. స్థానికంగా గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కిల్ పరిధిలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లు రెడు చోట్ల 3.15 ఎంవీఏ సామర్థ్యం గల అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు చోట్ల 3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు పెంచామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, మరమ్మతులు, ఇతర కారణాల వల్ల లైన్ లేదా సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచి పోయినట్లయితే ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓవర్ లోడ్ పెరిగే అవకాశం ఉన్నందున 36 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయి లో నెలకొల్పామన్నారు. 8 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని తెలిపారు. ముందుగా వేసవి కార్యాచరణ సిద్ధం చేసుకుని ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నామని తెలిపారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి



పోటీలను ప్రారంభిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి అన్నారు. గిరిజన క్రీడా పాఠశాలల్లో శిక్షణ ఇచ్చేందుకు గురువారం జిల్లా స్థాయి ఎంపిక క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి ప్రారంభించారు. పోటీల్లో నాలుగో తరగతి చదువుతున్న బాలికలు 105, బాలురు 64 మంది పాల్గొన్నారు. 9 అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన వారిని ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఇందులో ప్రతిభ చాటిన వారిని ఈ నెల 19న హైదరాబాద్ బోయినపల్లిలో ఉన్న వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఎంపిక పోటీలకు పంపించనున్నామని గిరిజన క్రీడాధికారి బండ మీనారెడ్డి తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ ఈ ఏడాది తమ పాఠశాల నుంచి 25 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీఓ శకుంతల, ఏటీడీఓ చిరంజీవి, ప్రధానోపాధ్యాయుడు జంగు, మనోహర్, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొంత మంది వ్యక్తులు మీటర్లు తిరగకుండా చేస్తామని వినియోగదారుల వద్దకు వచ్చి డబ్బులు తీసుకుంటూ మోసగిస్తున్నారని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ ప్రభాకర్ అన్నారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ మీటర్లు తిరగకుండా చేస్తామని ఎవరైనా వచ్చినట్లయితే నమ్మకూడదని చెప్పారు. అలాంటి వ్యక్తులను గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఆయన వెంట ఎస్సై శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరించాలి

వాంకిడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని (టీయూడబ్ల్యూజే, ఐజేయూ) తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. మండల కేంద్రంలోని జెత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహిస్తున్న శ్యామినేర్ దీక్షా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కార్, భదంతే భంతే ధమ్మ సారథి, భంతే రాహుల్‌బోధి, భంతే నిన్నాన్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బెజ్జూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రానికి చెందిన గంగాదరి తిరుపతి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తిరుపతి ఈ నెల 22న బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని, బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదన్నారు. తిరుపతి భార్య దేవక్క గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- ఉన్నతాధికారులకు సమస్య నివేదిస్తాం
- అదనపు కలెక్టర్ మోతిలాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్, పక్కన రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారి లక్ష్మణ్‌ప్రసాద్

బెల్లంపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శాంతిఖని గని విస్తరణ కోసం భూముల అవసరం లేదని, రైతులు ఆందోళన చెందొద్దని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శాంతిఖని గని లాంగ్‌వాల్ ప్రాజెక్టు కోసం గురువారం శాంతిఖనిగని ఆవరణలో ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం సంబంధిత అధికారులు నిర్వహించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శాంతియుత ర్యాలీ నిర్వహిస్తూ ప్రజాభిప్రాయ సేకరణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మోతిలాల్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మణ్ ప్రసాద్ హాజరయ్యారు. సమీప గ్రామాల ప్రజల నుంచి అభిప్రా యాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సమీప గ్రామాల ప్రజలు మాట్లాడుతూ శాంతిఖనిగని లాంగ్‌వాల్ ప్రాజెక్టుతో భూగర్భ జలాలు తగ్గుతాయని పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వందలాది మంది రైతులు వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టు చేపడితే భూ గర్భ జలాలు దెబ్బతిని వ్యవసాయ భూముల్లో బోర్లకు నీరు రావడం లేదన్నారు. ఎన్నో పంటలు సాగుచేసుకుంటు జీవనోపాధి పొందుతున్నామన్నారు. లాంగ్‌వాల్ ప్రాజె క్టుతో తమ భూములు సాగుకాక భూగ ర్భ జలాలు దెబ్బతిని నీరు లేక బీడు భూములుగా మారిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నష్టాలతో వ్యవసాయం చేస్తున్నామని, లాంగ్‌వాల్ ప్రాజెక్టు విస్తరిస్తే పదివేల మందితో నిరాహార దీక్ష చేపడుతామని చెప్పారు. లింగాపూర్ గ్రామంలో గ్రామంలో 400 నుంచి 500ఫీట్ల బోర్లు వేస్తే నీళ్లు రావడం లేదని శాంతిఖని గని ప్రభావంతోనే ఇబ్బందులు ఎదురవుతు న్నాయని వాపోయారు. కొందరు అధి కారులు శాంతిఖ నిగనిని ఓపెన్ కాస్టుగా చేస్తామని సమీప గ్రామ ప్రజలను ఆందోళన చెందే విధంగా మాట్లాడుతు న్నారని ప్రస్తావించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మణ్ ప్రసాద్‌లు మాట్లాడుతూ శాంతిఖనిగనిని ఓపెన్‌కాస్టు చేయడం లేదని ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని వెల్లడించారు. శాంతిఖని గని భవిష్యత్ కోసం లాంగ్‌వాల్ ప్రాజెక్టు చేపడుతామని సూచించారు. ఈ ప్రాజెక్టు కోసం రైతుల భూములకు కూడ అవసరం లేదని చెప్పారు. శాంతిఖనిగని జీవితకాల పెంచేందుకు ప్రాజె క్టు విస్తరిస్తున్నామన్నారు. ఈ సమయంలో ప్రజాభి ప్రాయ కార్యక్రమానికి హాజరైన సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా లాంగ్‌వాల్ ప్రాజెక్టు వద్దని ఆందోళన చేశారు. దీంతో పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణలో సమీప గ్రామాల ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఏసీపీ రవికుమార్‌తో పాటు సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.




ఆందోళన చేస్తున్న ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు

రివైజ్డ్ పెన్షన్లు ఎప్పుడు?

● విశ్రాంత కార్మికుల ఎదురుచూపులు

శ్రీరాంపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే అరకొర పెన్షన్‌తో నెట్టుకొస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు నూతనంగా అమలయ్యే రివైజ్డ్ పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ఎలాంటి సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 11వ వేతన ఒప్పందం ప్రకారం రివైజ్డ్ పెన్షన్ రావాల్సిన రిటైర్డ్ కార్మికులు శ్రీరాంపూర్ ఏరియాలో 2106 మంది ఉండగా, 1138 మంది దరఖాస్తులు గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయానికి వెళ్లాయి. కానీ అందులో 83 మాత్రమే పరిష్కారమయ్యాయి. మరో 968 శ్రీరాంపూర్ ఏరియాలోని విభాగాలు, గనుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అయితే రిటైర్డ్ కార్మికుల నుంచి సమాచారం లేదని, అవసరమైన కాగితాలు అందించలేదని అందుకే ఆయా దరఖాస్తులను తాము సీఎంపీఎఫ్ కార్యాలయానికి పంపించలేకపోతున్నామని శ్రీరాంపూర్ ఏరియా అధికారులు చెబుతున్నారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని అంటున్నారు. సీఎంపీఎఫ్ కార్యాలయం అధికారులతో చర్చలు జరిపి దరఖాస్తులు పరిష్కారానికి నోచుకునేలా చూడాలని కోరుతున్నారు.



ఉద్యోగినులకు ఆటల పోటీలు



టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న మహిళలు, అధికారులు

శ్రీరాంపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. జీఎం కార్యాలయం ఎదుట ఉన్న కేంద్ర నర్సరీలో మహిళా ఉద్యోగులకు బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్ పోటీలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓటు జీఎం శ్రీధర్‌రావు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) ఎ. రాజేశ్వర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ రావు, సీనియర్ పీఓ రణదీప్‌గౌడ్, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ పాల్గొన్నారు.

అనుమతి లేని రికవరీలు నిలిపివేయాలి

శ్రీరాంపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కార్మికుల అనుమతి లేకుండా గుర్తింపు సంఘం చందా రూపంలో వసూలు చేస్తున్న డబ్బుల రికవరీలు నిలిపివేయాలని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం తమ ఇష్టానుసారం కార్మికుల వేతనాల నుంచి 2 నెలలకు 100 రూపాయలు రకవరీ చేయిస్తోందని పేర్కొన్నారు.

ఉద్యోగుల పనివేళల్లో మార్పులు చేయాలి

శ్రీరాంపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని సింగరేణి ఉద్యోగుల పనివేళల్లో మార్పులు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపరితల గనులు, సీహెచ్ పీలలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు మొదటి బదిలీ, రెండో బదిలీ పనివేళలు కుదించాలని కోరారు.

సొంత వైద్యం చాలా ప్రమాదం

లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్య సేవలు ఎలా ఉన్నాయి...?

వైద్యుడు : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. ప్రజలకు ఎలాంటి వైద్యం కావాలన్నా ప్రభుత్వ ఆసుపత్రు లనే ఆశ్రయించాలని ఎందుకంటే అనుభవజ్ఞులైన వై ద్యులు అందుబాటులో ఉంటారు. నాణ్యమైన వైద్యం అందుతుంది,

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు రక్త నమూన పరీక్షలు చేస్తున్నారా..?

వైద్యుడు : ప్రజలకు రూపాయి ఖ ర్చు లేకుండా ప్రభుత్వమే టీహబ్‌ను ఏ ర్పాటు చేసింది. ఇందులో సుమారు 120 రకాల రక్త, మూత్ర నమూన పరీక్షలు పైసా ఖర్చు లేకుండా చేస్తారు.

ఆంధ్రజ్యోతి : గర్భిణులకు ఎలాంటి సదుపాయాలు ఉన్నాయి....?

వైద్యుడు : గర్భిణులకు ప్రత్యేకమైన వైద్య సదుపాయాలు అందిస్తున్నాము. ప్రతీ వారం రోజులకు ఒక సారి స్కానింగ్ చేయడంతో పాటు నూటికి నూర శాతం నార్మల్ డెలివరీకి ప్రయత్నం చేస్తున్నాము. డెలివరీలు కూడా ఆసుపత్రుల్లోనే చేస్తున్నాం. ఏదైన అత్యవసరం ఉంటే మాత్రమే మంచిర్యాల మాత శిశు ఆసుపత్రికి పంపిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : ఆసుపత్రిలో వైద్యులు ఎంతమంది ఉన్నారు, 24గంటలు వైద్యులు అందుబాటులో ఉంటున్నారా....?

వైద్యుడు : లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఐదుగురు వైద్యులు ఉన్నారు. 24గంటల పాటు షిప్టుల వారిగా అందుబాటులో ఉంటూ పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తున్నారు.

-లక్షెట్టి పేట, ఆంధ్రజ్యోతి

నియామకం

మందమర్రి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాపీ మే స్త్రీల సంఘం గౌరవ అధ్యక్షుడిగా స్థానిక పాత బస్టాండ్‌కు చెందిన బండి సదానందం యాదవ్ నియమితులయ్యారు. బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో సదానందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అద్దెభవనాలు.. అరకొర వసతులు..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో తగ్గుతున్న హాజరు శాతం
- భవనాలు మంజూరైన నిర్మాణాల్లో కనిపించని పురోగతి
- ఒంటికి, రెంటికి ఇంటికే..
- అవస్థలు పడుతున్న పిల్లలు



భీమారం మండల కేంద్రంలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



కాసిపేట మండలం చిన్నధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

కాసిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక పూర్వప్రాథమిక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శిధిలావస్థకు చేరిన భవనాలు, అరకొర వసతులతో ఉన్న అద్దెభవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యంలేక పోవడం, ఆవాసాలకు దూరంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉండ డంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు కష్టాలు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతంపై తీవ్ర ప్రభావం పడుతుంది. పేర్లు నమోదు చేసుకున్న చిన్నారుల సంఖ్యలో సగం మంది కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరు కాకపోవడం ఆందోళన కలిగిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 18కొత్త భవనాలను మంజూరు చేసింది. కానీ గుత్తేదారులు ఆసక్తి కనబర్చక పోవడంతో భవన నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, సరైన మరుగు దొడ్లు లేకపోవడంతో పిల్లలు, బాలింతలు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడుతు న్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై చొరవచూపి భవన నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

● భవన నిర్మాణాల్లో కనిపించని పురోగతి

జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 486 కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 297 కేంద్రాలు గ్రామపంచాయతీ కార్యాలయాలు లేదా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అద్దె ప్రీ స్కూల్స్‌గా నిర్వహిస్తున్నారు. కేవలం 186 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మంచిర్యాల జిల్లాలో 2024-25 సంవత్సరంలో మండలానికి ఒకటి చొప్పున 18 మండలాల్లో 18 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలను మంజూరు చేసింది. ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో గుత్తేదారులు ఎవరు కూడా నిర్మాణ పనులపై ఆసక్తి చూపడం లేదు. కొన్ని భవన నిర్మాణాలు పునాదుల్లోనే నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల భూముల గుర్తింపు, స్థలాల స్వాధీనం, సమస్యలు నెలకొనడంతో 8 భవనాలకు భూమి పూజ నిర్వహిం చారు. పంచాయతీ రాజ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయించాలని అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

● వేధిస్తున్న వసతుల కొరత

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత విద్యార్థులను, బాలింతలు, గర్భిణులను తీవ్రంగా వేదిస్తుంది. కేంద్రాలకు వచ్చే పిల్లలు బాలింతలకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక కేంద్రాలకు రావడానికి భయపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు ఇప్పటికీ ఒంటికి, రెంటికి ఇంటికే పరిగెడుతున్నారంటే కేంద్రాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 969 కేంద్రాల్లో కేవలం 15కేంద్రాల్లోనే మరుగుదొడ్లు ఉన్నాయని కేంద్రాల పరి స్థితి అర్థమవుతుంది. ఇప్పుడు 150 కేంద్రాలకు మరు గుదొడ్లు, 40 కేంద్రాలకు మంచినీటి సౌకర్యం కల్పించేం దుకు నిధులు మంజూరు కావడం కొంత ఊరటనిచ్చింది. కానీ నిర్మాణాల్లో నాణ్యతలోపం కారణంగా మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం కాకుండానే పగుళ్లు తేలుతున్నాయి. నీటిసౌకర్యం లేకపోవడంతో పూర్తయిన మరుగుదొడ్లు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రధాన పట్టణాల్లో మొబైల్ టాయిలెట్లు అందు బాటులోకి రావడం హర్షించదగ్గ విషయమే. అయినప్పటికీ అన్ని కేంద్రాల్లో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించి అందు బాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

● భర్తీకి నోచుకోని పోస్టులు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి ఏడాదిలోపు పిల్లలు 3925 ఉండగా ఏడాది నుంచి 3ఏండ్లలోపు పిల్లలు 18,305 మంది ఉన్నారు. 3 ఏండ్ల నుంచి 6ఏండ్లలోపు పిల్లలు 10,333 మంది ఉన్నారు. గర్భిణులు 3059, బాలింతలు 3915 మంది ఉన్నారు. 969అంగన్‌వాడీ కేంద్రాల్లో 886మంది టీచర్లు ఉండగా 83పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయాలు 613 పని చేస్తుండగడా 356 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదవీ విరమణ పొందిన కేంద్రాల్లో టీచర్లను, ఆయాలను భర్తీ చేయకపోవడంతో కేంద్రాలను నిర్వహించడం ఇబ్బందిగా మారుతుంది. పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

త్వరలోనే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా, టీచర్ పోస్టులను భర్తీ ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. అభ్యర్థులకు విద్యార్హత ఇంటర్మీడియట్ గా నిర్ణయించాము. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల వివ రాలను ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించి పోస్టులను భర్తీ చేయను న్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల్లో వేగం పెంచి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- రౌఫ్ ఖాన్, జిల్లా సంక్షేమాధికారి, మంచిర్యాల

నూతనోత్సాహం..

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో గతంలో జరిగిన సంఘటనలు గుర్తు చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. బండి సంజయ్ ప్రసంగం పట్ల ఆకర్షితులైన పట భద్రులు, టీచర్లు సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పట్టం కట్టారు.

పంచాయతీ ఎన్నికల ముందు జోష్..

పంచాయతీ ఎన్నికల ముందు బీజేపీ అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందడం పట్ల ఆ పార్టీ శ్రేణులు విజయోత్సాహంతో ఉన్నారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఆ ఎన్నికలకు ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయాన్ని బీజేపీ శ్రేణులు రెఫరెండంగా భావిస్తున్నారు. ఇదే ఉత్సాహంతో కార్యకర్తలు పని చేసి పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ అగ్రనేతలు సూచిస్తున్నారు. దీనికి తోడు ప్రధాని నరేంద్రమోదీ సైతం ఎక్స్ వేదికగా బీజేపీ విజేతలను అభినందించడం కూడ ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపినట్లయింది.

బెల్లంపల్లి వాసికి డాక్టరేట్



సింగతి ఉపేందర్

బెల్లంపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన సింగతి ఉపేందర్‌కు ఉస్మానియ యూనివర్సిటీలో డాక్టరేట్ లభించింది. భారతీయ నాటకాల మీద పరిశోధన చేసినందుకు, స్టడీఆఫ్ సెల క్టెడ్ ప్లేస్ ఆఫ్ ఇండిపెండెంట్ అనే అంశంపై పరిశోధన జరిపినందుకు గాను ఉస్మానియ యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ డాక్టరేట్ రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పత్తి రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు

చెన్నూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దేశానికి వెన్నుముక అయిన రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వారిని పట్టించుకోకపోవడంతో రైతులు కన్నీరు పెట్టాల్సిన దుస్థితి నెలకొందని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం చెన్నూరు పట్టణంలోని తాపీ సంఘం భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పత్తి రైతులను అధికారుల అండదండలతో దళారులు విపరీతంగా దోచుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పత్తి రైతుల ఆవేదనను పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. పత్తి రైతుల ఆవేదనను పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధుల తీరును ఉపేక్షించేది లేదని, పత్తి రైతులకు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. మండల కార్యదర్శి సమ్మయ్య, పట్టణ కార్యదర్శి చందు, నాయకులు నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు కస్తూరిభాగాంధీ పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని అందులో భాగంగా ప్రతీ పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, ప్రహరీగోడతో పాటు ఇతర అన్ని సధుపాయాలను కల్పించిందన్నారు. వీటితో పాటు హాస్టల్ విద్యార్థులకు ఇటీవలే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచామని మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని ఆదేశించారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో ప్రతీ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాదించేందుకు పక్క ప్రణాళిక సిద్ధం చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో కిచెన్, డైనింగ్ హాలులను పరిశీలించారు. అంతకు ముందు పట్టణంలోని నూతనంగా నిర్మాణం చేపడుతున్న 30 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మారితి ప్రసాద్, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ కవిత, బాలికల పాఠశాల ప్రిన్సిపల్ శైలజ పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించేందుకు కృషి

ఎస్ఈ గంగాధర్



జనరేటర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

చెన్నూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని ఎస్ఈ గంగాధర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శివాలయం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండా కాలంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఇందుకు అనుగుణంగా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రికి అందిస్తున్న విద్యుత్ సరఫరా, ఆసుపత్రిలోని జనరేటర్‌లను పరిశీలించారు. ఆయన వెంట డీఈ కైసర్, ఏడీఈ బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలి

మంచిర్యాల క్రైం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయికుంట గిరిజన బాలికల పాఠశాలలో తోటి మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నైతం శ్రీనివాస్‌ను విధుల నుంచి తొలగించాలని విద్యార్థి సంఘం నాయకులు డీటీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో మహిళ అధ్యాపకులతో అసభ్యకరంగా ప్రవర్తించిన శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో టీవీజేఎస్ జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్‌కుమార్, బీసీవీ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేక్ సల్మాన్ బాషా, టీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రేగుంట క్రాంతి కుమార్‌లు ఉన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

గర్మిళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మూడు నెలల ముందు నుంచే ముందస్తు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా సరిపడ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో 33/11కేవీ సబ్ స్టేషన్‌లైన భీమిని, ఇదారం, క్యాతనపల్లి, నెన్నెల, వేమనపల్లిల్లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఏసీసీ, రాజీవ్ నగర్, కుందారం, జన్నారంలో 5, 3 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. సరఫరా నిలిచిపోయిన సమయంలో ఇబ్బందులు లేకుండా ఇంటర్ లింక్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అవసరం మేరకు 2 కొత్త ఫీడర్‌లను ఏర్పాటు చేశామని, బంచ్ ఫీడర్లు ఉన్న చోట ఇప్పటి వరకు కొత్తగా వీసీబీలు 17 ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

మందమర్రి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని త్రిశక్తి అష్టలక్ష్మి కామైఖ్య దేవాలయంలో గురువారం ఆయా విగ్రహ ప్రతి ష్ఠాపన పూజలు పండితుల వేద మంత్రోచ్చారణల మద్య ప్రతిష్ఠించారు. ముందుగా విగ్రహాలకు జలాధివాసన పూజలు చేశారు. రాజ శ్యామల దేవి, వారాహిదేవి, లలితాదేవి, శ్రీవల్లభ, మహాగణపతి, ధ్వజస్తంభ, శ్రీ యంత్ర ప్రతిష్టాపన చేశారు. విశాఖపట్నానికి చెందిన వేణుశ్యామల మాతాజీతో పాటు బాసరకు చెందిన వేదపాఠశాల పండితులు పెద్ద సంఖ్యలో హాజరై శాస్త్రోపేతంగా పూజలు నిర్వహించారు.

ఆలయ నిర్మాణకర్త, ప్రధాన అర్చకులు సతీష్‌భవాణి భక్తులను ఉద్దేశించి అమ్మవార్ల విశిష్టతను వివరించారు.

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు జయకృష్ణారెడ్డి.

దండేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే ఏమాత్రం భయపడకుండా, కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకుంటేనే విజయం వరిస్తుందని మోటివేషనల్ స్పీకర్ లింగాపూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జయకృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం పిఎంశ్రీ దండేపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పరీక్షల పట్ల భయం పోగొట్టడానికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు బాగా రాయాలన్నారు. ప్రణాళికతో చదువుకుంటునే పరీక్షలో మంచి ఫలితాలు సాధించవచ్చునని, ఇది పరీక్షల సమయం కావడంతో సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతి భద్రతలకు అవరోధంగా మారే భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం దిశగా మండల, సబ్ డివిజన్, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎస్‌హెచ్‌వోలు ఉంటారని, నివాస ప్రాంతాలు, నిర్మాణ అనుమతులు, సరైన అనుమతులు లేని అక్రమ కట్టడాలపై మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్‌లను ప్రత్యేక అధికారులు గా తీసుకుంటామన్నారు. మండల కమిటీ ప్రతినిధులు ప్రతి సోమ వారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్‌లో నమోదు చేసి గ్రీవెన్స్ నెంబర్ కేటాయిస్తారని తెలిపారు.

ఆదాయం ఘనం..వసతులు శూన్యం



తాండూర్ సంతలో ఎండలో విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు

శనివారం సంతలో వ్యాపారులకు తప్పని ఇక్కట్లు

తాండూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పేదల సూపర్ బజార్లుగా పేరొందిన వారపు సంతలు సమస్యల లోగిళ్లుగా మారాయి. వీటి ద్వారా లక్షల రుపాయల ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు, ఫ్లోరింగ్, సిమెంట్ బల్లలు తది తర సదుపాయాలు కరువయ్యాయి. వేసవిలో నీడ కోసం, వర్షం పడితే తడిసిపోకుండా విక్రయదారులు, కొనుగోలుదారులు పరుగులు తీయాల్సిందే. తాండూర్ మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శనివారం సంత పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. లక్ష్యానికి మించి ఆదాయం సమకూరుతున్నా ఎవరు పట్టించుకో కపోవడంతో కనీస మౌలిక వసతులు లేక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిపోయింది. ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సంత జరుగుతుంది. స్థానిక ప్రజలు, ఉద్యోగులు తాజా కూరగాయలు, సరుకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేయడానికి వస్తుంటారు. అయితే కూరగాయల విక్రయదారులు సగం రోడ్డుపైకి దుకాణాలు పెట్టడంతో కొనుగోలు దారులు నిల్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. రోడ్డు ఇరుకుగా ఉండంతో దుకాణాల దగ్గర వరకు వాహనాలు వస్తున్నాయి. దీంతో కొనుగోలుదారులు, విక్రయదారులు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడు తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి సంతలో తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

అలాగే పోలీసులు శనివారం సంత వద్ద ట్రాఫిక్ జామ్ తలెత్తకుండా ఆంక్షలను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

●అధికమొత్తంలో వసూళ్లు..

ప్రతి సంవత్సరం కూరగాయల సంతను వేలంలో దక్కించుకునే వారు వ్యాపారస్తుల వద్ద నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వసూలు చేసి రశీదులు ఇవ్వాలి. కానీ ఇది పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇష్టారాజ్యాంగ ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే నాలుగింతలు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ముఖ్యంగా ఎండు మిర్చి అమ్మే వారి వద్ద నుంచి రూ. 400 నుంచి 500 వసూలు చేస్తున్నట్లు సమాచారం. కూరగాయల వ్యాపారుల వద్ద రూ. 50 నుంచి 100 వసూలు చేస్తూ వారికి ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వసూలు చేసేలా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు.



సంత రోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం (ఫైల్)

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం

అడువాల సతీష్, అచ్చలాపూర్



వారసంతలో కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సంత నిర్వాహకులు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు. కానీ మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. రాత్రివేళలో కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే మరుగుదొడ్లు, కరెంటు తదితర సౌకర్యాలను కల్పించాలి.

అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు

శ్రీధర్, కన్నెపల్లి



సంతలోని వ్యాపారుల వద్ద సంత నిర్వహకులు అధిక డబ్బులను వసూలు చేస్తున్నారు. కట్టిన డబ్బులకు రశీదులు ఇవ్వడం లేదు. కనీసం తాగునీరు సదుపాయం కూడా లేదు. దీంతో వ్యాపారులు, కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. సంతలోని సమస్యలను పరిష్కరించాలి.

మహిళా వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు

రాజవ్వ, శ్రీరాంపూర్



సంతలో మహిళ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో వ్యాపారం వదిలి ఊరు అవతలికి వెళ్లాల్సి వస్తుంది. అలాగే మిరప కాయల వ్యాపారుల వద్ద రూ. 300 నుంచి 500 వసూలు చేస్తున్నారు. దీంతో మేము నష్టపోతున్నాం. సమస్యలను అధికారులు పరిష్కరించాలి.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు

8

శుక్రవారం 7 మార్చి 2025

తెలంగాణ తొలి దశ ఉద్యమకారులను గుర్తించాలి

ఆసిఫాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి దశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని ఉద్యమకారుల సంఘం నాయకులు మహమ్మద్ అబ్దుల్ రావూఫ్, పుల్లూరి కిష్టయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1969లో జరిగిన తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొని, నెల రోజులు జైలు శిక్ష అనుభవించామని పేర్కొన్నారు. మలిదశ ఉద్యమంలో భాగంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలని 21 రోజుల పాటు దీక్షలో పాల్గొన్నామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించి 125 గజాల భూమి మంజూరు చేయాలని కోరారు.

కొనసాగుతున్న విచారణ

బెజ్జూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై విచారణ కొనసాగుతోంది. కార్యదర్శి గ్రామంలో ఇంటి నెంబర్ల జారి కోసం డబ్బులు డిమాండ్ చేస్తూ ఉండడంతో గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం మండల ప్రత్యేకాధికారి అబ్దుల్ నదీం గ్రామస్తులు, ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ జరిపారు. ఫిర్యాదులో పేర్కొన్న పలు అంశాలపై విచారణ జరిపినట్లు మండల ప్రత్యేకాధికారి తెలిపారు. . విచారణ నివేదికలను అదనపు కలెక్టర్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీవో గౌరిశంకర్ తదితరులు ఉన్నారు.

అద్దె భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆసిపాబాద్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కుమరం భీం చౌరస్తాలో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గుండి రోడ్డులోని ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో గల నూతన అద్దె భవనంలోకి మార్చినట్లు సబ్ రిజిస్ట్రార్ ఎన్ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వరకు కుమరం భీం చౌక్‌లో గల అద్దె భవనం శిథిలావస్థకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇతర భవనంలోకి మార్చామని తెలిపారు.

వంతెన పైనుంచి పడి యువకుడి మృతి

సిర్పూర్(టి), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట- పోడ్సా మధ్య పెన్‌గంగా నదిపై ఉన్న వంతెన పై నుంచి పడి ఈసుగాం గ్రామానికి చెందిన ప్రశాంత్ సన(32) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ సన బుధవారం మధ్యాహ్నం మహారాష్ట్రలోని దాబాకు వ్యాపార నిమిత్తం వెళ్లాడు. తిరిగి రాత్రి పెన్‌గంగా నదిపై ఉన్న వంతెనపై నుంచి వస్తున్నా డు. ఈ క్రమంలో పోడ్సా వంతెన వద్ద ప్రమాదవ శాత్తు కింద పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రశాంత్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కౌటాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సీఐ రమేష్, ఎస్సై మధుకర్‌లతో పాటు మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్యలు ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో 10 ఫ్రాంచైజీలు తమ క్రీడాకారులను గతంలోనే వేలం పాటలో కైవసం చేసుకున్నాయి. ఈ క్రీడల్లో మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేల నగదును అందించనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంటలకు రక్ష.. భూసార పరీక్ష



రైతు తన భూమిలో పంట అధిక దిగుబడి సాధించాలన్నా.. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నా..ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. మట్టి స్వాభావం తెలుసుకోవాలన్నా.. భూమిలో ఎలాంటి పంటలు పండించుకోవాలన్నా పరక్ష ఫలితాలను బట్టి తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారులు ఇప్పటి నుంచే రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

- ఏటా వేసవిలో మట్టి నమూనా పరీక్షలు
- అవగాహన లేమితో దృష్టి సారించని రైతులు
- వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారుల సూచన
- జిల్లాలో 70 క్లస్టర్లు, 4.6 లక్షల ఎకరాల్లో పంటల సాగు

చింతలమానేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములు ఏ రకమైన పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి. భూమిలోని పోషకాల స్థాయి, ఎరువుల వాడకం ఏ సందర్భాల్లో ఉపయోగించాలనే విషయాలపై రైతులకు అవగాహన కలగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు తోడవడంతో అన్నదాతలు ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో భూసార పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు ఈ పరీక్షలు చేయించడం లేదు. మరి కొంత మంది రైతులు ప్రైవేటుగా భూసార పరీక్షలు చేయించుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు సైతం ఈ విషయంలో అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారన్న ఆరోపణలున్నాయి.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 70 క్లస్టర్లు ఉన్నాయి. 4.6లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను రైతలు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారుగా 1.5లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా వర్షాకాలం, యాసంగిలో పత్తి, వరి, సోయా, మిరప, పెసరా, మినుము, జొన్న, మొక్క జొన్న, శెనగ, కంది, తదితర పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఎరువులు ఎంత మోతాదులో వాడాలి. భూమి ఏ పంటలకు అనుకూలంగా ఉందో తెలియక పోవడంతో పెట్టుబడి పెరిగి ఆశించిన దిగుబడి రాని పరిస్థితి. ఫలితంగా అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

రసాయన ఎరువులు..

పంటల సాగులో విరివిగా రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో సాగు వ్యవసాయం పెరగడంతో పాటు భూమిలో పోషక విలువలు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలియక అవసరానికి మించి క్రిమి సంహారక మందులు వినియోగి స్తున్నారు.భూసార పరీక్షల ప్రాధాన్యంపై సదస్సులు, సమావేశాల్లో వ్యవసాయశాఖ పదేపదే చెప్తున్నా రైతులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. మరోవైపు భూసార పరీక్షల ఫలితాలను సైతం అధికారులు సమయానికి అందించడం లేదని రైతులు చెబుతున్నారు.

ఫలితాల ఆధారంగా..

భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాలను అనుసరించి పంటల సాగు, అధిక దిగుబడి వస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని ఉదజని, లవణ సూచక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యత ను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా అవసరమైన మోతాదులో ఎరువులు వినియోగించవచ్చు. వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఆశ్రయించి వారు సూచించిన వంగడాలను ఉపయోగిస్తే దిగుబడి పెరుగుతుంది. కాగా భూసార పరీక్షల పట్ల అవగాహన ఉన్న కొందరు రైతులు వ్యవసాయ అధికారులు పరీక్షలు చేసేందుకు కాలయాపన చేస్తే ప్రైవేటుగానే కొందరు భూసార పరీక్షలు చేయించుకుంటున్నారు. దీని ద్వారా వారికి ఆర్థికంగా కొంత మేర భారం పడుతుంది. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో పరీక్ష కిట్లు అందుబాటులో ఉంచితే మేలని చెబుతున్నారు.

గ్రామాల్లో అవగాహన కల్పించాలి..: రౌతు అంజన్న, రైతు



భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలపై రైతులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలి. భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుంది. దీని ద్వారా రైతులు ఏ పంటలు వేసుకోవాలో తెలుసు కునే అవకాశం ఉంది.

బీజేపీ నాయకుల సంబరాలు



బెజ్జూరులో బాణాసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించడంతో గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనోహర్‌గౌడ్, బాలకృష్ణ, దిగంబర్, రాకేష్, శంకరయ్య, రాజారాం, మల్లేష్, పద్మాకర్ పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించడంతో బీజేపీ మండల అధ్యక్షుడు ఆడే సురేష్ ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆడే అశ్విన్, హిరామన్, దేవిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమురయ్య విజయం సాధించడంతో గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బానాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, రామన్న, తుకారాం, రంగన్న, మోహన్, నవీన్, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించడంతో బీజేపీ ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట్నాక విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు గురవారం నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చారు. మిఠాయిలు పం చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు రాథోడ్ సందీప్ మండల అధ్యక్షుడు మేస్రాం జ్ఞానేశ్వర్, బీజే వైఎం మండల అధ్యక్షుడు అర్జున్, దిలీప్, నగేష్ దేవరావ్, జనార్దన్, జగన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కొమురయ్య విజయం సాధించడంతో గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ్, ప్రభాకర్‌గౌడ్, దామోదర్, శంకర్, రాజన్న, లక్ష్మాజీ, రాజు, లచ్చన్న, వెంకన్న, గోపాల్, రాకేష్, సత్యం, మహేష్, శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



జైనూర్‌లో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో జిల్లాలో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీలలో సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని గురువారం సందర్శించి మొక్కల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీలలో పెరుగుతున్న ప్రతీ మొక్కను సంరక్షించాలని తెలిపారు. మొక్కల రక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కలు ఎండి పోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ పథకం సిబ్బంది మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. నిర్లక్ష్యం వహించకూడదన్నారు. నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి కవితకు షోకాజు నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బానోత్ దత్తారాం, ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కూలీల రక్షణకు చర్యలు..

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా పని ప్రదేశాలలో ఉపాధి హామీ కూలీల రక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం ఎల్లారం శివారులో గల వ్యవసాయ చేనులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఎండ తీవ్రత దృష్ట్యా నీడ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు జాబ్ కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. ఆ దిశగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల చూపు బీజేపీ వైపు



మాట్లాడుతున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, దీంతో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి ప్రజల్లో అదరణ పెరుగుతుందని వచ్చే స్థానిక ఎన్నికలలో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యావాదాలు తెలిపారు. అనంతరం అంబేద్కర్‌చౌక్ ఎదుట బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, బీజేపీ నాయకులు విశాల్, ప్రసాద్‌గౌడ్, పెంటయ్య, జయరాజ్, మధుకర్, వెంకన్న పాల్గొన్నారు.

ఎద్దుకు గ్రామస్థుల అంత్యక్రియలు



ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

లింగాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయానికి చెందిన ఎద్దు గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామస్థులు అంత్యక్రియలు నిర్వహించారు. 25 ఏళ్ల క్రితం ఓ భక్తుడు హనుమాన్ మొక్కు కోసం లేగదూడను ఆలయానికి అందజేశాడు. అప్పటి నుంచి ఆలయ పరిసరాల్లోనే ఎద్దు తిరుగుతోంది. ఆలయానికి వచ్చిన భక్తులు దానికి ప్రసాదం పెట్టేవారు కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై గురై గురువారం మృతి చెందింది. దీంతో గ్రామస్థులు ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయక్ కిరణ్‌నాయక్, జాదవ్ కైలాస్, సక్రారామ్, హసిరాం, బాపురావు, అంబాజీ, నారాయణ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



కూలీల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

జైనూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాం, టింకాపెల్లి, ఉషేగాం తదితర గ్రామాల్లో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి గురువారం ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేయాలన్నారు. ఎండలో ఎక్కువ సేపు పని చేయకూడదని సూచించారు. ఉయం 7 గంటలకు పనికి వెళ్లి మధ్యాహ్నం 12 గంటల లోపు తిరిగి ఇంటికి చేరుకోవాలని చెప్పారు. ఎండల తీవ్రత పెరిగినందున వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం ఆయన టింకాపెల్లిలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్, టెక్నికల్ అసిస్టెంట్ జాడి రాజలింగు, తాజ మాజీ సర్పంచ్ కుంర శాంరావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

దహెగాం/సిర్పూర్(యు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు గురు వారం ప్రశాంతంగా కొనసాగాయి. దహెగాం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు 130 మందికి గానూ 124 మంది హాజరయ్యారని సీఎస్ గణపతి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.సిర్పూర్(యు) మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ఉదయ్‌కుమార్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

ఆధ్యాత్మిక సందడి

- తండాల్లో ప్రారంభమైన సేవాలాల్ దీక్షలు

కెరమెరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లంబాడా (బంజారాల) ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ తండాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏటా శివరాత్రి పండగ రోజు మాలలు స్వీకరిస్తారు. శ్రీరామనవమి వరకు 41 రోజుల పాటు సేవలాల్ దీక్షలు స్వీకరిస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని దీక్ష భూమి వద్ద మాలలు స్వీకరిస్తారు.

దీక్ష సమయంలో..

దీక్ష సమయంలో మాలధారులతో పాటు ఇంటిల్లిపాది భక్తి భావంతో ఉంటారు. మద్యం, మాసంకు దూరంగా ఉంటారు. ప్రతి రోజు ఒక పూట మాత్రమే భోజనం చేస్తారు. లింగభేదం లేకుండా వీలును బట్టి 41, 21, 11 రోజుల మాలధారణ చేస్తారు. దీక్ష భూమి కొత్తపల్లిలో ప్రారంభమైన దీక్షలు, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని బంజార భక్తులు పాటిస్తున్నారు. చివరి రోజు పౌరాదేవి (మహారాష్ట్ర) వాసిమ్ జిల్లాలోని పౌరదేవి గ్రామంలో కొలువైన జగదాంబదేవి సేవాలాల్ మహరాజ్ సమాధి పౌరగడ్ పీఠాధిపతి బాల బ్రహ్మచారి రామరావు మహరాజ్‌లకు ప్రత్యేక పూజలు చేసి దీక్షలు విరమిస్తారు. దీక్షా గురు ప్రేంసింగ్ మహరాజ్ పీఠం కొత్తపల్లి నుంచి మహారాష్ట్రలోని పౌరదేవి వరకు 350 కిలో మీటర్లు భక్తులు పాదయాత్రగా వెళ్తారు. ఉగాది పండుగ రోజు నుంచి పాదయాత్ర ప్రారంభించి శ్రీరామ నవమికి పౌరదేవి ఆలయానికి చేరుకుంటారు.

దీక్షలతో మార్పు..



సేవాలాల్ దీక్షలతో యువతలో మార్పు కనిపిస్తోంది. స్వీకరిస్తారు. భక్తిభావం, ఏకతా భావం పెరుగుతోంది. దీక్షలతో సంస్కృతీ సంప్రదాయాలు భవిష్యత్ తరాల వారికి అందించగలుగుతాం. ఇది శుభ పరిణామం.

- ప్రేమ్‌సింగ్ మహరాజ్, దీక్షా గురువు



సేవాలాల్ దీక్షలు స్వీకరిస్తున్న బంజారాలు(ఫైల్)